క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


స్వామి (ఫైల్)

నడికూడ : అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల స్వామి(40) ఇంట్లో నిద్రిస్తున్నాడు. భార్య కిరాణం సరుకుల కోసం పరకాలకు వెళ్లింది. తిరిగి వచ్చేసరికి మంచంపై విగతజీవిగా కనిపించాడు. దీంతో ఆమె స్థానిక పోలీస్‌లకు సమాచారం అందించింది. ఘటన స్థలానికి ఎస్సై శివకృష్ణ చేరుకొని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం పరకాలకు తరలించినట్లు తెలిపారు.

సీఐని కలిసిన నాయకులు



శాయంపేట : సీఐ రంజిత్‌రావును పెద్దకోడెపాక ఎంపీటీసీ వేణుగోపాలప్రసాద్, పత్తిపాక ఎంపీటీసీ గజ్జి ఐలయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బుచ్చిరెడ్డి, రవి, రవీందర్, ప్రకాశ్‌రెడ్డి, వలీహైదర్, కుమారస్వామి, రవిపాల్, రాజు, రఫీ, రాజేందర్, రమేష్, తిరుపతి, భాస్కర్, వీరన్న మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు



ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గు లోని 163 జాతీయ రహదారి సమీపంలోని కటాక్షపూర్ చెరువు ప్రమాదకరస్థితిపై స్థానిక సమైఖ్య యూత్ అసోసియేషన్ సభ్యులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. చెరువులో ప్రమాదకర గుంతలు ఉన్నాయని, చెరువులో దిగడం, ఈత కొట్టడం చేయరాదు అని సూచిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మేడారం జాతరకు వెళ్లే వారు సేదతీరేందుకు ఆగి సరదాకు చెరువులో దిగొద్దని అందులో సూచించారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన యువకులను స్థానికులు అభినందించారు.

ప్లాస్టిక్‌ను వాడొద్దు



వేలేరు : మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించుకోవాలని వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా అధ్యక్షుడు రతన్‌సింగ్‌ఠాకూర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో అందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని అన్నారు. మానవ మనుగడకు ప్లాస్టిక్ ప్రమాదకరమని అన్నారు. జాతరకు వెళ్లే ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు, బట్ట సంచులు తీసుకెళ్లాలని సూచించారు. మేడారం జాతరకు వెళ్లే భక్తులు ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వస్తువులు తీసుకెళ్లొద్దని కోరారు. ఆసంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, సతీష్ పాల్గొన్నారు.

జాతర కమిటీ చైర్మన్‌గా అశోక్



కమలాపూర్ : సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఆస్కార్ అశోక్, డైరెక్టర్లుగా కొనిశెట్టి మునీందర్, మస్నా చంద్రశేఖర్, చేరాల విజయ, కొలుగూరి కుమారస్వామి, మోటం రాజు, జక్కు లావణ్య, పులికంటి ప్రభాకర్, కోడెపాక రవి, వైనాల సాంబయ్య, కిన్నెర కృష్ణమూర్తి, కొండ మొగిలి, బండి ప్రశాంత్, మోటం బాలాజీ, శనిగరం రవీందర్, తరిగొప్పుల నరేష్, బండి రాజు, మోటం రాకేష్, బాలసాని హరీష్, మొగిలిచర్ల శ్రీనివాస్, పెరుమాండ్ల పరుశురాములు, దయ్యాల రవి, ఎంబాడి ఐలయ్యను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తమ నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, నాయకులు బాలసాని రమేష్, తొటం రవీందర్‌కు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. జాతరలో భక్తులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. భక్తులు సంయమనం పాటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సమస్యలు తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు.

మినీ జాతరలకు వేళాయె..

- 21 నుంచి 24 వరకు తల్లుల దర్శనం
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- గ్రామాల్లో మొదలైన సందడి
- వివిధ ప్రాంతాల నుంచి రానున్న భక్తులు

జిల్లాలో మినీ మేడారం జాతరలు ముస్తాబవుతున్నాయి. ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న జాతరలకు వేలాది మంది భక్తులు తరలివచ్చి సమ్మక్క–సారలమ్మను దర్శించుకుంటారు. ఎత్తుబంగారం, చీర, సారె, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు సమర్పిస్తారు. ఇందుకోసం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, క్యూలైన్లు తదితర వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించారు.

నడికూడ : కంఠాత్మకూర్ పిడుగుగుట్ట సమీపంలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో సమ్మక్క–సారలమ్మ జాతరను వైభవంగా నిర్వహించనున్నారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గద్దెలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. తాగునీటి కోసం బోర్లు, స్నానాల ఘట్టాలకు పైపులైన్లు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

12వ శతాబ్దం నుంచి..

పిడుగుగుట్ట సమీపంలో ఉన్న సమ్మక్క –సారలమ్మ జాతర 12వ శతాబ్దం నుంచి జరుగుతున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. పిడుగుగుట్టల సమీపంలో సమ్మక్క–సారలమ్మ సేద తీరినట్లు పూర్వికులు చెప్పినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. రెడ్డి రాజులు చంద్రగిరి గుట్టల సమీపంలో పరిపాలన సాగించిన తరుణంలో సమ్మక్క భర్త పగిడిద్దరాజుతో కలసి గుట్టలను స్థావరంగా మార్చుకుని ఈ ప్రాంత ప్రజలతో కలిసిపోయినట్లు చరిత్ర చెబుతోంది.

జాతర అభివృద్ధికి కృషి చేయాలి



సమ్మక్క –సారలమ్మ జాతరకు సుమారు లక్షకు పైగా భక్తులు వస్తారు. చుట్టుపక్క గ్రామాలతో పాటు హనుమకొండ, వరంగల్ నుంచి భక్తులు అధికంగా వస్తారు. జాతర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి

– ఎడ్ల కిరణ్‌కుమార్, పూజారి, కంఠాత్మకూరు


వేలేరు : ముస్తాబైన ఎర్రబెల్లి జాతర ప్రాగణం


శాయంపేట : జోగంపల్లి మినీ జాతర ప్రాగణం


శాయంపేట : జాతర ప్రాగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు


నడికూడ : కంఠాత్మకూరు సమ్మక్క –సారలమ్మ జాతర ప్రాంగణం


వేలేరు : జాతరలో అమ్మవార్ల గద్దెలు


ధర్మసాగర్ : పీచర సమ్మక్క సారలమ్మ గద్దెలు

వేలేరులో..

వేలేరు : మండలంలోని పీచర, ఎర్రబెల్లిలో మినీ మేడారం జాతర ఈనెల 21, 22, 23, 24 తేదీల్లో నిర్వహించేందుకు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. గద్దెలకు, ఆలయ ప్రాంగణాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ తన ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షలను మంజూరు చేయగా హైమాస్ట్ లైట్లను కొనుగోలు చేసి జాతర ప్రాగణంలో అమర్చుతున్నారు.

పీచర జాతర నేపథ్యం..

గ్రామానికి చెందిన గొర్రెల కాపరి జల్తారి కనుకయ్య తన వ్యవసాయ భూమి వద్ద రాత్రి గొర్రెల మందకు కాపలాగా కంకవనం చెట్ల కింద పడుకున్నాడని, అర్ధరాత్రి ఓ అదృశ్య శక్తి వచ్చి కనుకయ్యను తన వెంట తీసుకుని వెళ్లి ప్రస్తుతం జాతర జరిగే ప్రాంతంలో పసుపు, కుంకుమ భరణాలను అక్కడ వదిలి అదృశ్యమైనట్లు స్థానికులు చెబుతున్నారు. 2013 సంవత్సరంలో జారత ప్రారంభం అయ్యింది. చైర్మన్‌లుగా పనిచేసిన కీర్తి వెంకటేశ్వర్లు, రఘు నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఎర్రగొల్ల ఎల్లయ్య జాతర అభివృద్ధిలో కీలకపాత్ర పోశిస్తున్నారు. ప్రస్తుతం కొయ్యడ మహేందర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. జాతర సమయంలో టెండర్లు నిర్వహించగా వచ్చిన ఆదాయంతో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. సుమారు 20 నుంచి 30 వేల మంది భక్తులు వచ్చి అమ్మవార్లను దర్శించుకోనున్నారు. అలాగే ఎర్రబెల్లి గ్రామంలో 2011 సంవత్సరం నుంచి జాతరను కాలేరు పుష్పలీలా, చినబాబు ఆధ్వర్యంలో బైరవు నిబండ ప్రాంతంలో నిర్వహిస్తున్నారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం



ఈనెల 20వ తేదీ నుంచే పీచర మినీ మేడారం జాతర ప్రారంభమవుతుంది. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. వివిధ వస్తువులను విక్రయించేందుకు వేలం నిర్వహించగా రూ.6లక్షల 9వేలు ఆదాయం వచ్చింది. వీటితో జాతరకు వచ్చే భక్తులకు మౌళిక సౌకర్యాలు కల్పిస్తాం.

– మహేందర్, పీచర, మినీ జాతర చైర్మన్

నారాయణగిరిలో..

ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరిలో నిర్వహించే మినీ మేడారం సమ్మక్క–సారక్క జాతరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అప్పని భాస్కర్ ఆధ్వర్యంలో కోయ పూజారి సాంబయ్య ఈనెల 21వ తేదీన సారక్క, 22వ తేదీన సమ్మక్కను గద్దెలపైకి తీసుకువస్తారు. 24న వనప్రవేశం జరగనుంది. ఈ జాతర 2006 సంవత్సరంలో అప్పని సత్తయ్య ఆధ్వర్యంలో ప్రారంభమైంది. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దెత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

21 నుంచి జాతర మొదలు



నారాయణగిరి గ్రామంలో ఈ నెల 21వ తేదీ నుంచి మినీ మేడారం జాతర ప్రారంభమవుతుంది. పనులు సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– అప్పని భాస్కర్, నిర్వాహకుడు

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని జోగంపల్లిలో ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు జరుగనున్న సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు వచ్చే భక్తులకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గద్దెలకు కలర్లు వేయగా రూ.3 లక్షల 80 వేలతో పారిశుధ్య పనులు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు. 1991 నుంచి జాతర ప్రారంభం కాగా ప్రతి ఏడాది అభివృద్ధి పనులు చేస్తూ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.

జాతర ప్రత్యేకత

1991లో సమ్మక్క–సారలమ్మలు బుస్స మల్లయ్య కలలో కనిపించి జోగంపల్లి గ్రామ శివారులో కంకవనం రూపంలో వెలుస్తున్నామని జాతరను నిర్వహించాలని తెలిపారని మల్లయ్య గ్రామ పెద్దలకు తెలిపాడు. దీంతో కంకవనాన్ని గుర్తించి ఉత్సవాలను ప్రారంభించారు. మైలారం, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల పెద్దలు కలిసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మేడారం గిరిజన పూజారులను స్వాగతించి పూజలు జరుపడం అనవాయితీగా కొనసాగుతుంది.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం



సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. గద్దెలకు, గ్రీల్స్‌కు పేయింటింగ్ వేయించాం. పోలీస్, రెవెన్యూ అధికారుల సహకారంతో జాతరను ప్రశాంతంగా కొనసాగిస్తాం.

– అబ్బు ప్రకాశ్‌రెడ్డి, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్

జారతలో ఉల్లాసంగా గడుపుతాం



మినీ జాతరకు ఎడ్ల బండిలో కుటుంబ సమేతంగా వెళ్లి ఉల్లాసంగా గడుపుతాం. అమ్మవార్లకు మొక్కులు చెల్లించి వంటలు చేసుకొని వనభోజనం చేస్తాం. జాతరకు వచ్చే భక్తులందరం కలిసిమెలిసి కుటుంబ సభ్యుల్లా ఉంటాం.

– గడిపె సమ్మయ్య, భక్తులు

31 ఏళ్ల నుంచి జాతర

మినీ జాతర 31 ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నాం. మేడారం నుంచి పూజారులను పిలిపించి జాతర నిర్వహించుకుంటాం. జాతర అనంతరం మైలారం, పెద్దకోడెపాక, జోగంపల్లి మూడు గ్రామాల ప్రజలు స్నేహితులను, బంధువులను పిలుచుకొని వనభోజనాలకు వెళ్తాం. సారలమ్మను మా ఇంటి నుంచే తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తాం.

– అమ్మ ధర్మయ్య, పూజారి

వినియోగదారులు వివరాలు నమోదు చేసుకోవాలి

- ఏడీఈ దేవేందర్‌నాయక్

శాయంపేట : మండలంలోని కేటగిరి–1 విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న 200యూనిట్ల ఉచిత కరెంట్ పొందేందుకు వివరాలు ఇవ్వాలని విద్యుత్‌శాఖ ఏడీఈ దేవేందర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో గృహజ్యోతి పథకానికి అధికారులు చేపట్టిన సర్వేను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆహార భద్రతకార్డు కలిగిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి తగిన సమాచారం అందించి వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న విద్యుత్ వినియోగదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. బిల్లింగ్ మిషన్‌లో వివరాలు లేనివారి ఆధార్‌కార్డు, ఆహార భద్రతకార్డు, మొబైల్ నంబర్లను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఏఈ రాజ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ దామోదర్, లైన్‌మెన్ సంతోష్, జేఎల్‌ఎం విష్ణు, సిబ్బంది అరుణ్ పాల్గొన్నారు.


సేకరించిన వివరాలను పరిశీలిస్తున్న ఏడీఈ

కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి


ఎల్కతుర్తి : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


కమలాపూర్ : మాట్లాడుతున్న భిక్షపతి

ఎల్కతుర్తి : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో గురువారం కాంగ్రెస్ నాయకులు ఎల్కతుర్తి–సిద్దిపేట రహదారిపై కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు చిట్టంపల్లి అయిలయ్య, మండల మహిళా అధ్యక్షురాలు, చిదురాల స్వరూప, ఊసకోయిల ప్రకాశ్, చంద్రశేఖర్‌గుప్తా, శ్రీకాంత్, జక్కుల అనిల్, మాడుగుల గోపి, సదానందం, పొన్నాల మురళి, బొజ్జ కొమురయ్య, ముఖర్జీ పాల్గొన్నారు.

కమలాపూర్ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి, అర్హత హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లేదని యువజన కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి పోడేటి భిక్షపతి మండిపడ్డారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సెంటిమెంట్‌తో గెలిచిన కౌశిక్‌రెడ్డిది కూడా గెలుపేనా అని ఎద్దేవా చేశారు. నాయకుడు రమేష్‌గౌడ్, టీపీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిలయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి విష్ణుదాసు వంశీధర్‌రావు, నాయకులు జనగాని శివకృష్ణగౌడ్, నాంపెల్లి ప్రభాకర్, బొల్లం రాజిరెడ్డి, బాలపురి కనుకరత్నం, గట్టు శ్రీధర్, రాములు, ఆకినపెల్లి భిక్షపతి, కుమార్, రాజేందర్, రామకృష్ణ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

శాయంపేట : భూ తగాదాల సమస్యను పరిష్కరించే క్రమంలో పెద్దమనుషుల మాట వినడం లేదని ఓ వ్యక్తి సదరు రైతుపై దుర్భాషలాడుతూ దాడి చేసిన సంఘటన మండలంలోని కొత్తగట్టుసింగారంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముదిగొండ సంతోష్‌కుమార్, దానబోయిన సతీష్ మధ్య నాలుగేళ్లుగా భూమి విషయంలో తగదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మండల కేంద్రంలో ఇరువురి మధ్య సయోధ్య కుదుర్చేందుకు పెద్దమనుషులు పంచాయతీ నిర్వహించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకొని మేం చెప్పేదే వినాలి అంటూ సదరు రైతు ముదిగొండ సంతోష్‌కుమార్‌పై దర్భాషలాడుతూ దాడి చేశాడు. రైతు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించిన పోలీస్‌లు శ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. కాగా భూతగాదాలో ఇద్దరు రైతులను తహసీల్దార్ సుభాషిణి ఎదుటు లక్ష రూపాయల పూచికత్తుపై ఎడాదిపాటు బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్సై దేవేందర్ తెలిపారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పరకాల : చేవేళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో క్రైస్తవుల ప్రార్థన మందిరంపై మారణాయుధాలతో చేసిన దాడిని నిరసిస్తూ పట్టణంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఫెలోషిప్స్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని గీసుగొండ, సంగెం, ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల మండలాలకు చెందిన క్రైస్తవులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అంబేడ్కర్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె.సామ్యేల్ మాట్లాడుతూ.. ప్రార్థన మందిరంపై దాడి చేసిన దుండగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి శ్రీనివాస్, ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మెసెస్, సాల్మన్, సామ్యేల్, ఫిలిప్‌జాన్, శ్రీనివాస్, జోసఫ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

మామునూరులో..

మామునూరు: చర్చిలు, పాస్టర్లపై, భక్తులపై దాడికి దిగిన మతోన్మాద శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఐనవోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మార్క్ గురువారం డిమాండ్ చేశారు. మండలం కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాన్వాడ, నెనూర్ గ్రామాల్లోని చర్చిలపై ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు దాడులు చేసి చర్చి ఆస్తులను ధ్వంసం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి సంఘనటలు జరగడం బాధాకరమని అన్నారు. మతాలను, కులాలను విడదీస్తూ దాడులకు ప్రేరేపించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోలన చేపడుతామని హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు


వీరేశం


ఫణిచంద్ర


శ్రీనివాస్


ఆంజనేయులు


వెంకటేశ్వర్లు

ఎల్కతుర్తి / శాయంపేట / నడికూడ /పరకాల/ మామునూరు : భీమదేవరపల్లి మండల ఎంపీడీఓగా నాగంపల్లి వీరేశం గురువారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండల ఎంపీడీఓగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ ఎల్.భాస్కర్ భూపాలపల్లి జిల్లా గణపూరం మండలానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు ఎంపీపీ జక్కుల అనితారమేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పూలబొకే అందించి స్వాగతం పలికారు. అలాగే శాయంపేట ఎంపీడీఓగా ఫణిచంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయనను శాయంపేటకు బదిలీ చేశారు. కాగా గతంలో ఇక్కడ పనిచేసిన ఆమంచ కృష్ణమూర్తి హైదరాబాద్ పంచాయతీరాజ్ శాఖకు బదిలీ అయ్యారు. అదే విధంగా నడికూడ ఎంపీడీఓగా చిర్రబోయిన శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి బదిలీపై వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీకార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు స్వాగతం పలికారు. అలాగే పరకాల ఎంపీడీఓగా పెద్ది ఆంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా ఐనవోలు ఎంపీడీఓగా పులి వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు.

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న మిషన్ శక్తి కోఆర్డినేటర్ కల్యాణి

కమలాపూర్ : ఆడపిల్లలను రక్షించుకోవడం అందరి బాధ్యతని జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ కల్యాణి అన్నారు. గురువారం బేటీబచావో బేటీపడావో కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లకు బాలల రక్షణ చర్యలు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ.. బాల్య వివాహాల చట్టాలు, అక్రమ రవాణా గురించి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీల బాధ్యతలు, వాటిని ఎలా పటిష్టం చేయాలి, పిల్లల అక్రమ రవాణాకు దారి తీసే పరిణామాలు, పిల్లలపై తల్లిదండ్రులు, అధికారులు ఎలా వ్యవహరించాలనే విషయాల గురించి అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ నిషేధంకు సంబంధించిన పీసీపీఎన్ డీటీ యాక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిరీష, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మామునూరు: మండలంలోని నందనం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్‌హార్ట్స్ సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం మధుకర్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు చేయూతనందించడం అభినందనీయమని కొనియాడారు. హెచ్‌ఎం మధుకర్, తిరుపతిరావు పాల్గొన్నారు.

'నాగారం వాసికి ఉత్తమ రైతు పురస్కారం'



పరకాల : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కానుగుల భిక్షపతి జిల్లాస్థాయి ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకున్నారు. జాతీయ రేడియో కిసాన్ దివాస్‌ను పురస్కరించుకొని గురువారం హనుమకొండ ఆకాశవాణి వరంగల్ కేంద్రం ఆధ్వర్యంలో ఉత్తమ రైతు పురస్కారాలు అందించారు. కిసాన్ దివాస్ ఉత్సవాల్లో భాగంగా వివిధ పంటలు, ఉత్పత్తి తదితర వ్యవసాయ విస్తరణ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని సన్మానిస్తారు. ఈ ఏడాది పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన కానుగుల భిక్షపతికి జిల్లాస్థాయి ఉత్తమ రైతు అవార్డును ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వరంగల్ అధిపతి ఉమారెడ్డి, వరంగల్ ఆకాశవాణి నిర్వహకులు రవికుమార్, డాక్టర్ ఎల్లయ్య అందజేశారు.